

ఎమ్మెల్యే వీరేంద్రపై మూడోసారి ఈడీ దాడి

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, మనీ గేమింగ్ అవినీతిలో ఈడీ అధికారులు అరెస్టు చేసిన చిత్రదుర్గ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పిపై మూడోసారి శనివారం దాడి చేశారు. కస్టడీలో ఉన్న వీరేంద్ర తెలిపిన మేరకు ఈడీ అధికారులు అతడికి సంబంధించిన చళ్లకెరె బ్యాంకు లాకర్ల నుంచి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రెండు సంచులను తెప్పించుకున్న అధికారులు వాటిని భర్తీ చేసి తీసుకెళ్లారు. రెండు సంచులలో తీసుకెళ్లింది బంగారం, నగదా..? ఆస్తుల రికార్డులా? అనేది ఈడీ అధికారులు అధికారికంగా ప్రకటించలేదు.



బ్యాలెట్‌కే ఓటు

- స్థానిక ఎన్నికల్లో మార్పులు
- ఆర్డినెన్స్ జారీకి సర్కారు కసరత్తు
- 66వేల ఈవీఎంలు వెనక్కి
- గవర్నర్ స్పందనపైనే అందరి చూపు

బెంగళూరు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దశాబ్దాలకాలం పాటు సాగిన బ్యాలెట్ రూపంలోని ఎన్నికల ప్రక్రియకు స్వస్తి పలికారు. ఆధునాతనమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను తీసుకొచ్చారు. ఇటీవల రెండున్నర దశాబ్దాలుగా చట్టసభలు లోక్‌సభ, శాసనసభ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఈవీఎంల ద్వారానే నిర్వహించారు. సహకార బ్యాంకులు, కో-ఆపరేటివ్ సొసైటీలతో పాటు ప్రైవేట్ సంస్థల ఎన్నికలు కూడా ఈవీఎంల ద్వారానే కొనసాగించారు. ప్రస్తుతం దేశమంతటా ఈవీఎంలతోనే గ్రామస్థాయి నుంచి దేశాన్ని పాలించే ప్రధానమంత్రిని ఎన్నుకునే ఎన్నికలదాకా ఈవీఎంల ద్వారానే అమలు చేస్తున్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం ఈవీఎంలను రద్దు చేసి వాటిస్థానంలో పాత విధానమైన బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలని తీర్మానించారు. అనుకున్నదే తడవుగా ఆర్డినెన్స్ జారీ చేసేందుకు కసరత్తు వేగవంతం చేశారు.

స్థానిక ఎన్నికల్లో సమూల మార్పులు

స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిన అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు రోజులక్రిందట జరిగి కేబినెట్ సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా మంత్రివర్గం ఆమోదానికి ముందే కనీసస్థాయిలో చర్చలు జరిగేవి. ఆ తర్వాత కేబినెట్‌లోనూ ప్రస్తావించి మంత్రులు నిర్ణయానికి అనుగుణంగా అమలు చేసేవారు. అయితే కేబినెట్‌లోకి వెళ్లేదాకా ఎక్కువమంది మంత్రులకు సైతం బ్యాలెట్ రూపంలో ఎన్నికలు జరపాలనే అంశం ఒకటి చర్చకు వస్తుందని కూడా తెలియదని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో గ్రామ పంచాయతీ, పట్టణ, నగర పంచాయతీ, పురసభలతో పాటు మహానగర పాలికెలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇటువంటి కీలక సమయంలో నిర్ణయం తీసుకోవడం ద్వారా వరుసగా బ్యాలెట్ విధానంతోనే ఎన్నికల్లోకి వెళ్లాలనేది ప్రభుత్వ ఆశయంగా ఉంది. కర్ణాటక గ్రామస్వరాజ్, పంచాయతీరాజ్ చట్టానికి సంబంధించి మూడు బిల్లులకు సవరణ చేసి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) పరిధిలోకి తీసుకొచ్చారు. దీని ప్రకారం పలు సవరణలు చేసి శాసనసభలో ప్రభుత్వం ఆమోదింపజేసింది. ఇందులోనే గ్రేటర్ బెంగళూరు పరిధిలో ఎన్నికలను బ్యాలెట్ రూపంలో జరపాలని బిల్లులో పొందుపరిచారు. ఉభయసభల్లోనూ ఆమోదం పొందినందున గ్రేటర్ బెంగళూరు అథారిటీకి ఎప్పుడు ఎన్నికలు జరిపినా బ్యాలెట్ రూపంలోనే కొనసాగించాల్సి ఉంటుంది. జీబీఏ చట్టాన్ని మున్సిపాలిటీల్లోనూ అమలు చేసే చట్టసవరణ చేయదలిచారు. ఇందుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వం వేగవంతంగా అడుగులు వేస్తోంది. ఈనెల 11న గురువారం మంత్రివర్గ సమావేశంలో చట్టసవరణలపైనే చర్చించి తీర్మానించదలిచారు.

హైకమాండ్ ఆదేశాలే కారణమా..?

ఈవీఎంల ద్వారా ఎన్నికలలో మోసాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు జరిపిన ప్రతిసారి ఆరోపణలు చేస్తోంది. ఏడాదిక్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలోనూ కాంగ్రెస్‌కు ఘోర పరాజయం వెనుక ఈవీఎంలతోపాటు ఓటు చౌర్యం కారణమని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు చేసి పోరాటం చేస్తున్నారు. అయితే రాహుల్‌గాంధీ ఇప్పటివరకు ఢిల్లీ, బిహార్, బెంగళూరులలో మాత్రమే ఓటుచౌర్యానికి సంబంధించి పలు ఆరోపణలు చేశారు. ఇదే విషయమై పార్లమెంటులో తీవ్రస్థాయిలో పోరాటం చేసిన విషయం తెలిసిందే. దీంతో సభలో కార్యకలాపాలు సైతం నిలిచిపోయాయి. ఆ తర్వాత బిహార్‌లో పోరాటం నిరంతరంగా కొనసాగిస్తున్నారు. అక్కడ శాసనసభ ఎన్నికలు ఉన్నందున ప్రత్యేకదృష్టి సారించారు. ఇప్పటికే డీసీఎం ఒక్కరోజు, ముఖ్యమంత్రి ఒకరోజు, సహచర మంత్రులతోపాటు బిహార్ వెళ్లి రాహుల్‌గాంధీకి మద్దతు ఇచ్చారు. బెంగళూరులో ఓటు చౌర్యం సెంట్రల్ లోక్‌సభస్థానం పరిధిలోని మహదేవపురలో ఓటుచౌర్యం జరిగిందని ఆరోపించిన రాహుల్‌గాంధీ, ఎన్నికల కమిషన్‌కు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కానీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, సీఎం, డీసీఎంలు సంతకాలు చేసి ఎన్నికల కమిషన్‌కు ఇచ్చారు. ఇలా అధిష్ఠానం సూచనలతోనే ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలను జరపాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్రానికో సందేశంతో ఓటు చౌర్యం, ఈవీఎంలలో గందరగోళం అనే అంశాలను దేశమంతటా ప్రచారం చేయదలిచింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్నికలు ఉన్నందున ఓటు చౌర్యంకు ప్రాధాన్యం ఇచ్చి స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వం ఉన్న కర్ణాటకలో బ్యాలెట్ రూపంలో ఎన్నికలకు డిమాండ్‌ను సూచించినట్లు తెలుస్తోంది. అందుకే హడావుడిగా మంత్రివర్గంలో తీర్మానించి వారంరోజులలోనే ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.


గవర్నర్ ఎలా స్పందిస్తారో..?

ప్రభుత్వం తీసుకునే ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఎలా స్పందిస్తారనేది కుతూహలమైంది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన వెంటనే రాజ్‌భవన్ నుంచి వెనువెంటనే ఆమోదం సాధ్యం కాదనేది పలు అంశాల్లో రుజువైంది. అటువంటిది దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలను బ్యాలెట్ రూపంలో జరపాలనే నిర్ణయానికి గవర్నర్ ఆమోదం తెలుపుతారా..? అనే సర్వత్రా చర్చనీయాంశమైంది. గవర్నర్ ఆమోదిస్తేనే చట్టం కార్యరూపం దాలుస్తుంది. గవర్నర్ తిరస్కరిస్తే ప్రభుత్వం తదుపరి ఏ విధంగా వ్యవహరిస్తుందనేది ప్రశ్నార్థకమే.




66వేల ఈవీఎంలు వాపసు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్ద 66వేల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లు ఉన్నాయి. అవి 15ఏళ్లకుపైగా వినియోగించారు. 15ఏళ్ల పైబడిన ఈవీఎంలను ఉపయోగించేందుకు అవకాశం లేదని రాష్ట్ర ఎన్నికల అధికారి బీఎస్ సంగ్రేశి ఇటీవలే ప్రకటించారు. దీంతో 66వేల ఈవీఎంలను తయారుచేసిన బీఈఎల్ సంస్థకు వాపసు ఇవ్వాలని నిర్ణయించారు. ఒకవేళ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని భావిస్తే కొత్త ఈవీఎంలను కొనుగోలు చేయాల్సి ఉండేది. ప్రభుత్వం బ్యాలెట్ రూపంలో ఎన్నికలు జరపాలని సిద్ధమవుతుండడంతో రాష్ట్ర ఎన్నికల విభాగం కొత్త ఈవీఎంలను సమకూర్చుకోవాలనే ఆలోచనను విరమించుకుంది.



గెలిస్తే ప్రజల విశ్వాసం.. ఓడితే ఈవీఎంల కుట్ర

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ప్రతిపక్షనేత అశోక్



బెంగళూరు(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో గెలిస్తే ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసించారని గొప్పలు చెప్పడం... ఓడిపోతే ఈవీఎంలే కారణమంటూ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. కేవలం ఓ కుటుంబ రక్షణ, సమర్థించుకునేకోసం దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని ఆదివారం ఎక్స్ ద్వారా పోస్ట్ చేశారు. సీఎం, డీసీఎంలు కనీసం ఆలోచించాలన్నారు. 2004, 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఇవే ఈవీఎంల ద్వారా గెలిచారని, 2013లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిందని, అప్పుడు ఈవీఎంలు బాగున్నాయా..? అంటూ ప్రశ్నించారు. 2023లో రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బ్యాలెట్ రూపంలో ఎన్నికలు జరిగాయా..? అంటూ ప్రశ్నించారు. ఈవీఎంలపై అనుమానం వ్యక్తం చేసేముందు దశాబ్దాలకాలం క్రితంనాటి బ్యాలెట్ ఎన్నికలకు వెళ్తాననేది ఎవరి మెప్పుకోసం అంటూ నిలదీశారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీల మెప్పు పొంది కుర్చీ కాపాడుకునేందుకు ఎంతటిస్థాయికైనా దిగజారేందుకు సిద్ధమవుతున్నారన్నారు. మీ వ్యక్తిత్వం, గొప్పదనాన్ని కన్నడిగుల ముందు ఎందుకు దిగజారుస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగవాది, ప్రజాస్వామ్యవాదిగా గుర్తించుకోదలచుకున్నారా..? లేదా అధిష్ఠానం గులాంలుగా మారి ఆత్మవంచన చేసుకోదలిచారా..? అంటూ ప్రశ్నించారు. రాజకీయాలలో విమర్శలు, ఆరోపణలు ఉంటాయని కానీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఆధారస్థంభమైన ఎన్నికల ప్రక్రియ పట్లే సందేహాలు వ్యక్తం చేసేలాంటి పాపపు పనులకు పాల్పడరాదన్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా బోగస్ ఓటింగ్, బ్యాలెట్‌పేపర్, బూత్ క్యాప్చరింగ్ వంటి సంఘటనలు జరగలేదా..? అన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో పాతాళంలోకి పడిపోయిన కాంగ్రెస్ పార్టీని రక్షించుకునేందుకు ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజలు తిప్పికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

నలుగురు ఎమ్మెల్సీల పేర్లు ఖరారు



రమేశ్ బాబు



జక్కప్పనవర్

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న స్థానాలకు నలుగురు ఎమ్మెల్సీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. పదిరోజులక్రిందటే వీరి పేర్లు ఖరారైనట్లు బహిరంగమైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. కేపీసీసీ మీడియా విభాగం ముఖ్యులు రమేశ్‌బాబు, కర్ణాటక ప్రభుత్వ ప్రవాస భారతీయ సమితి అధ్యక్షురాలు ఆరతి కృష్ణ, ఏఐసీసీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి జక్కప్పనవర్, ముఖ్యమంత్రి ఆప్తులు, పాత్రికేయుడు మైసూరుకు చెందిన శివకుమార్‌లకు వరించింది. ప్రభుత్వం నామినేట్ చేసిన కాంగ్రెస్ సభ్యులు యూబీ వెంకటేశ్, ప్రకాశ్ రాథోడ్‌ల పదవీకాలం 2024 అక్టోబరులో ముగిసింది. జేడీఎస్‌కు చెందిన తిప్పేస్వామి పదవీకాలం ఈ ఏడాది జనవరితో ముగిసింది. బీజేపీ నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్న సీపీ యోగేశ్వర్ చన్నపట్టణ అసెంబ్లీస్థానం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో పదవికి రాజీనామా చేశారు. ఇలా ఖాళీగా ఉన్న నాలుగుస్థానాలకు ఏడు నెలలుగా కసరత్తు సాగింది. ఇటీవలే అధిష్ఠానం అంగీకరించడంతో నలుగురి పేర్లు ఖరారు చేశారు. ఎమ్మెల్సీల జాబితాతో ఇన్నాళ్లు పార్టీలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడినట్లయ్యింది.



శివకుమార్



ఆరతి కృష్ణ

ఉనికి కోసమే బానుముస్తాక్‌పై హైకోర్టులో కేసు

- ధర్మస్థల వివాదంలో బీజేపీ కార్యకర్తలు: డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మైసూరులో దసరా ఉత్సవాలు బాను ముస్తాక్ ద్వారా ప్రారంభించరాదని హైకోర్టులో మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ పిటిషన్ దాఖలు చేయడంపై డీసీఎం డీకే శివకుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మనుగడ కోసం, తాము ఇంకా బతికే ఉన్నామని చెప్పుకొనేందుకే హైకోర్టులో పిటిషన్ వేశారని బీజేపీ మాజీ ఎంపీ ప్రతాప్‌సింహను ఉద్దేశించి మాట్లాడారు. ఆదివారం సదాశివనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ధర్మస్థల వివాదం వెనుక ఉండేవారు బీజేపీ వారేనన్నారు. పుర్రె వివాదంలో బయటపడిన వారంతా బీజేపీ కార్యకర్తలు కాదా..? అని ప్రశ్నించారు. ధర్మస్థలకు అన్యాయం, అవమానం జరిగింది బీజేపీ వారినుంచేనన్నారు. ప్రభుత్వం ధర్మస్థలకు న్యాయం చేసిందన్నారు. బీజేపీ వారు ఇలాంటికుట్రలు మాని చేతనైతే కేంద్రంనుంచి మేకెదాటు, మహదాయిలకు అనుమతులు ఇప్పించాలని, కృష్ణా ఎగువ ప్రాజెక్టుకు నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సదాశివనగర్ నుంచి కేపీసీసీ దాకా ఆయన బైక్‌పై వెళ్లారు.



బైక్‌పై వెళ్తున్న డీసీఎం

చంద్రగ్రహణ దృశ్యాలు

సంపూర్ణ చంద్రగ్రహణాన్ని బెంగళూరు వాసులు ఆసక్తిగా వీక్షించారు. ఆదివారం రాత్రి 11.50 గంటలకు కనిపించిన గ్రహణ దృశ్యాలివి

బెంగళూరు, ఆంధ్రజ్యోతి



ఒకే ఎన్నిక దేశానికి మంచిది

- వేల కోట్ల ఆదాతో ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఒక దేశం-ఒక ఎన్నిక ప్రస్తుత కాలఘట్టంలో అవసరమైనదని రాష్ట్రం, దేశానికి ఎన్నికలు ఒకేసారి జరిగితే మంచిదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అభిప్రాయపడ్డారు. బెంగళూరు మల్లేశ్వరంలోని హవ్యకభవనంలో ఆదివారం 'ఒక దేశం - ఒక ఎన్నిక' పేరిట విద్యార్థి నాయకుల సభ జరిగింది. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ ఎన్నికలకోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయన్నారు. ఒకే ఎన్నికతో భారం తగ్గి, పాలనా సంస్కరణలకు ఎంతో ప్రయోజనమన్నారు. చెడు అంశాలు వేగంగా ప్రజలకు చేరుతాయని, మంచివి కాస్త ఆలస్యంగా సమాజంలో అన్నివర్గాలకు తెలుస్తాయన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. కళాశాల విద్యార్థులు ఆలోచించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధీటైన నాయకత్వంతో దేశం అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అనతికాలంలోనే భారత్ ప్రపంచంలో రెండో ఆర్థికశక్తి కానుందన్నారు. ఈ దేశంలో మట్టిరుణం తీర్చుకునే విషయంలో రాహుల్ గాంధీ, మా ముఖ్యమంత్రులకు ఇవి సహించవన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్‌భాటియా మాట్లాడుతూ.. దేశమంతటా ఒకే ఎన్నికపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చామన్నారు. ఓటు బ్యాంకు కోసం కొందరు నీచమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, దక్షిణభారత్ ఇన్‌చార్జ్ అనిల్ కే ఆంటోని, యువమోర్చా అధ్యక్షుడు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, ఎమ్మెల్సీ నవీన్‌తోపాటు డాక్టర్ మల్లికార్జున బాలెకాయ, సంగీత కళాకారుడు ప్రవీణ్‌గోడ్ఖండి, మాజీ మహిళా క్రికెటర్ వేద కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి నాయకుల సభను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

వరినాట్లు వేసిన ఎస్పీ కవిత

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా ఎస్పీ డాక్టర్ కవిత వరిపైరు నాటి కూలీలతో కాసేపు సరదాగా గడిపారు. ఆదివారం కొళ్ళేగాల తాలూకా కుంతూరు గ్రామ పరిధిలోని ఓ పొలంలో కూలీలు వరినాట్లు వేయడాన్ని గమనించారు. ఇద్దరు పిల్లలతోపాటు బురదలోకి దిగి కాసేపు కూలీలతో కలసి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వరినాట్ల గురించి వివరించారు. పైర్లు పెద్దవై కాపు వస్తుందని, వాటి ద్వారానే అన్నం తింటామని పిల్లలకు తెలిపారు. సుమారు గంటకుపైగా కూలీలతో కలసి పొలంలో గడిపారు. తాను చిన్నప్పుడు పొలంలో పనిచేసినట్లు తెలిపారు.



వరినాట్లు వేస్తున్న ఎస్పీ కవిత

ఆలయాల మూసివేత

- చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక పూజలు
- మధ్యాహ్నం అన్నీ బంద్



గవి గంగాధరేశ్వరుడికి హారతి

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలన్నీ మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయాల తలుపులను అర్చకులు మూసివేశారు. సోమవారం తెల్లవారుజాముదాకా ఆలయాలు తెరిచేది లేదని ప్రకటించారు. బెంగళూరులోని గవిగంగాధరేశ్వర, బసవనగుడిలోని దొడ్డగణపతి, ఇస్కాన్ కృష్ణమందిరం, జయనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం, గాలి ఆంజనేయస్వామి ఆలయం, అణ్ణమ్మదేవి ఆలయం, బనశంకరి ఆలయంతోపాటు ధర్మస్థల, శృంగేరి, మైసూరు చాముండేశ్వరి, నంజన్‌గూడు శ్రీకంఠేశ్వర, మలె మహదేశ్వర, కొల్లూరు మూకాంబికా, హొరనాడు అన్నపూర్ణేశ్వరి తదితర ఆలయాలను మూసివేశారు.

కనకదుర్గమ్మకు యథావిధిగా పూజలు

బళ్లారి సిటీ (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని కనకదుర్గమ్మ ఆలయంలో చంద్రగ్రహణం సమయంలో కూడా యథావిధిగా పూజలు కొనసాగుతాయని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు హనుమంత్ప తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో పలు ఆలయాలను మూసివేసినా దుర్గమ్మ ఆలయానికి మాత్రం మూయాల్సిన అవసరం లేదన్నారు. అమ్మవారి చేతిలోనే సూర్య, చంద్రులు ఉంటారని, అమ్మవారికి గ్రహదోషం ఉండదన్నారు. మైనారు మైలార్‌లింగేశ్వర దేవస్థానం కూడా బంద్ ఉండదని యథావిధిగా పూజలు జరుగుతాయన్నారు.



మూసేసిన గంగాధరేశ్వరుడి ఆలయం



దుర్గమ్మ దేవస్థానంలో భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.00	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	42.064	34,421
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	41,553	34,181
నీటి నిల్వ (టీఎంసీలు)	79.80	101.77



ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన

గణేశ్ నిమజ్జనంలో ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

కంప్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కంప్లి పరిధిలోని గ్రామాల్లో పట్టణాల్లో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా జరుపుకున్నారు. శనివారం ప్రారంభమైన నిమజ్జనం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. నిమజ్జనంలో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సింధనూరు పట్టణంలో నిమజ్జనం కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్ జాతీయ పతాకంతో వినాయకుడు నిమజ్జనం కార్యక్రమంలో ఊరేగింపు చేపట్టారు. అలాగే డోలుడప్పులతో కళాకారులు కట్టుకున్నారు. వినాయక నిమజ్జనం కంప్లి అధిపతి వినాయక నిమజ్జనం భాజభజంత్రీల మధ్య మహిళలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. వేషభూషణలతో పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుండి క్యాంపుల నుండి తరలివచ్చారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్

సమావేశానికి తరలిరండి

తనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలోని పీవీ ఆర్ గ్రాండ్‌లో సోమవారం టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు కొర్తికోట, మాజీ సర్పంచ్ ఎస్‌కె. మస్తాన్‌వలి ఆదివారం ప్రకటనలో కోరారు.



మాట్లాడుతున్న చిదానందప్ప



పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

సమానత్వం కోసం కృషిచేసిన నారాయణ గురు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బ్రహ్మశ్రీ నారాయణ గురువులు సామాజిక విప్లవం ద్వారా కులతత్వం, అంటరానితనం అనే విష వృక్షాలను తొలగించి, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారని జిల్లా హామీ పథకాల అమలు ప్రాధికార సంస్థచైర్మన్ చిదానందప్ప అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు కల్చరల్ కాంప్లెక్స్ హాల్లో ఆదివారం నిర్వహించిన బ్రహ్మశ్రీ నారాయణ గురు జన్మదిన వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ గురు ఈళవ అనే అంటరాని కులంలో జన్మించారని, 19వ శతాబ్దంలో కేరళలో క్రూరత్వం, హింస , మేధావులకు నిలయంగా ఉన్న ఈరాష్ట్రంలో నంబూద్రి సమాజం శూద్రులు, అంటరానివారు, మహిళలు ,నిమ్న కులాల వారిపై చేసే అమానవీయ ప్రవర్తనను నివారించడానికి బ్రహ్మశ్రీ కృషి చేశారన్నారు. ఆ సమాజంలోని ప్రజలు ఆర్థికంగా ,సామాజికంగా ,విద్యాపరంగా, సాంస్కృతికంగా సాధికారత పొందాలన్నారు. బళ్లారిలోని ఆకాశవాణి ఎఫ్‌ఎం స్టేషన్‌లో అనౌన్సర్ , మాజీ లెక్చరర్ బసవరాజ్ ప్రత్యేక ఉపన్యాసంలో మాట్లాడుతూ ఎల్లవ సమాజానికి చెందిన మదన్ అసన్,కుట్టి అమ్మాళ్ దంపతులుకు నారాయణ గురు జన్మించారన్నారు. కేరళ రాష్ట్రంలో కుల మత బేదాలు ప్రబలంగా ఉన్న సమయంలో సామాజిక సంస్కర్త అయిన నారాయణగురు ఉద్భవించారని, సమాజంలో వివక్షతను తగ్గించడానికి తన జీవితాంతం అంకితం చేశారని ఆయన అన్నారు. ప్రపంచంలో ఒకే కులం, ఒకే మతం,ఒకేదేవుడు అనేది నారాయణ గురు ప్రదిపాదించిన సూత్రం,ఆయన ఒక ప్రత్యేకమైన పండితుడు, ఆయన తన సొంత వైఖరిలో కేరళ సమాజంలో అంటరానితనం అనే విపత్తుకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొన్నారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు బి.నాగరాజు, జిల్లా ఆర్య ఈడిగ గౌన మహాజన సంఘం జిల్లాధ్యక్షుడు శ్రీనాథ్, వివిధ సంఘాల పదాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాల్లో భాగంగా నగరంలో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో మహిళలు చిత్రపటాలతో కూడిన పూర్ణకుంభాలను మోసుకెళ్లడం , వివిధ సాంస్కృతిక బృందాలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

రాయచూరు (ఆంధ్రజ్యోతి): జిల్లాయంత్రాంగం, జిల్లా పంచాయతీ, మహానగర పాలిక, కన్నడ సంస్కృతి శాఖ, ఈడిగ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ నారాయణ గురు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నగరంలోని రంగమందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈడిగ సమాజం గురువు బ్రహ్మశ్రీ నారాయణ గురూజి చిత్రపటానికి రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు పులమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించిన ఉడుపి రిటైర్డ్ లెక్చరర్ దయానంద డీ, 18వ శతాబ్దంలో అందరిని ఏకం చేసి, మూఢనమ్మకాలను తొలంగించిన మహాన్ వ్యక్తి బ్రహ్మశ్రీ నారాయణ గురు అన్నారు.గురు ఆదర్శాలను కులబాంధవులు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.



రాయచూరు ఊరేగింపులో మంత్రి బోసరాజు, ఈడిగ సమాజ నేతలు

కంప్లి (ఆంధ్రజ్యోతి) : కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బ్రహ్మశ్రీ గురు నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో ముస్తాబు చేపట్టి పూజలు నిర్వహించారు. సమాజంలోని ప్రతి ఒక్కరు ఆయన గుర్తుంచుకోవాలని తహసీల్దార్ షణ్ముఖప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో పూజలు చేస్తున్న సిబ్బంది, గ్రామస్థులు

వ్యర్థాల నిర్వహణతోనే ఆరోగ్యకర సమాజం

● జిల్లా పర్యావరణ అధికారి రమేశ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పర్యావరణ అధికారి రమేశ్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజాలను నిర్మించడానికి వ్యర్థాల నిర్వహణ అవసరమని కర్ణాటక రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు రిటైర్డ్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ రమేశ్ అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ 2.0 సామర్థ్య అభివృద్ధి యూనిట్ కింద సమగ్ర వ్యర్థాల నిర్వహణపై పట్టణాభివృద్ధి శాఖ, జిల్లాయంత్రాంగం , జిల్లాలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం, రీసైక్లింగ్ , పునర్వినియోగాన్ని గరిష్టంగా ఉపయోగించడం పర్యావరణంపై వ్యర్థాల ప్రభావాన్ని తగ్గించడం కోసం సమగ్ర వ్యర్థాల నిర్వహణ ఒక విస్తృత విధానం అన్నారు. సమాజాలలో ఉత్పన్నమయ్యే వ్యర్థాల సేకరణ,రవాణా,విభజన,ప్రాసెసింగ్ ,పారవేయడం వంటి ప్రక్రియలను సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఆరోగ్యకరమైన స్థిరమైన సమాజాలను నిర్మించడానికి సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ ఒక కీలక లక్ష్యం.ఇంటింటికీ పారిశుధ్య పనులు, చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ విషయంలో ప్రజలకు సూచనలు ఇవ్వడానికి సిబ్బందికి హ్యాండ్ మైక్రోఫోన్‌లన పంపిణీ చేయాలని దాని వాడకంపై మార్గదర్శకాలను కూడా ఇవ్వాలని ఆయన అన్నారు. పౌరకార్మికులు, పారిశుధ్యకార్మికులకు భద్రతా పరికరాలను వినియోగం, నిర్వహణ,ప్రథమ చికిత్స వస్తు సామాగ్రి వాడకంపై అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ కమ్యూనిటీ మొబిలైజర్లు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణాలు స్థానిక సంస్థలలో పరిశుభ్రత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడానికి తగిన సూచనలు సిఫార్సులను స్వీకరించాలన్నారు. కమిషనర్ మంజునాథ్, డిప్యూటీ కమిషనర్ అబ్దుల్ రెహమాన్ ,మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య అధికారులు, పర్యావరణ ఇంజనీర్లు, హెల్త్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ తనిఖీ

● ప్రభుత్వాసుపత్రిలో సమస్యలపై ఆరాతీసిన జిల్లాధికారి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కంప్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని హడగలి తాలుకా హిరేహడగలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లాధికారి దివాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులతో సమస్యలపై ఆరా తీశారు. రోగులు డాక్టర్ వినోద్ గ్రామాల నుంచి, పట్టణాల నుంచి చికిత్స కోసం వచ్చిన రోగులకు వైద్యం చేస్తున్నారని, ప్రైవేట్ ఆస్పత్రి తరహాలనే వైద్యం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో సమస్యలు వుంటే వెంటనే జిల్లా ఆరోగ్య సంక్షేమ అధికారికి తెలుపాలన్నారు. ఆస్పత్రిలో వార్డులో పరిశుభ్రం, తాగు నీరు, రాత్రివేళ విద్యుత్ లైట్లు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా వుంచుకుని రోగులకు ఎలాంటి సమస్యలు తలెత్తుకుని చూడాలని సిబ్బందిని హెచ్చరించారు. గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన రైతులకు పంటలు ఇప్పటికే ఆ గ్రామాలు లెక్క అధికారులు ప్రవేశపెడుతున్నారు. సర్వే ప్రకారం రైతులకు ప్రభుత్వం ఆదుకునేలా చేపడుతామన్నారు. అలాగే గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇల్లు కూడా సర్వేలు జరుగుతున్నాయి. వారికి కూడా ఇల్లు సౌకర్యం కలిగేలా కూడా చేస్తామన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది అధికారులు, గ్రామాల నుండి పట్టణాల వరకు వర్షాకాలంలో అప్రమత్తంగా వుంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

పరిశీలకుడిగా ఎంపీ తుకారాం



ఎంపీకి పూరీ జగన్నాథ చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

కంప్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బళ్లారి లోక్‌సభ సభ్యుడు ఈ తుకారాంను ఒడిశాలోని బద్రక్ జిల్లాకు పార్టీ పరిశీలకుడిగా నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాలు పంపినట్లు ఆయన తెలిపారు. శనివారం బద్రక్ జిల్లా ను సందర్శించిన ఎంపీ అక్కడ ఏఐసీసీ నిర్వహించిన సంఘతన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణం, అభివృద్ధి చెందే విషయంపై కార్యకర్తలు, నాయకులతో చర్చించామన్నారు. పార్టీ హైకమాండ్ తనకు అప్పగించిన బాధ్యతను తాను నిర్వహించగలనని బళ్లారి ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుచిజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంపిక విషయంపైన కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిత్ పట్నాయక్, దేబా మొహరీత్, కృష్ణ చంద్ర, అఖిల్ యాదవ్, విశ్వజిత్, వెంకా నళినికారత్, మోహరతి రాజు, జేనా తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఉచ్చీరప్ప తాత ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, కళాకారులు

సిరుగుప్ప, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా ఉచ్చీరప్ప తాత సప్తభజన కార్యక్రమం జరిగింది. సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాత 22వ సంవత్సరం సప్తభజన కార్యక్రమాలు రెండు రోజుల పాటు జరిగాయి. ఆదివారం ఆలయం నుంచి తుంగభద్ర నది వరకు ఉచ్చీరప్ప తాత విగ్రహమూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా తాళమేళాలతో డోలు, ఢమరులతో నంది కోలాట ప్రదర్శనలతో వివిధ వేష భూషణలతో ఊరేగింపు కొనసాగింది. చలువప్ప, ఉచ్చీరప్ప తాత అన్నాదమ్ముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఉచ్చీరప్ప ఆధ్వర్యంలో అన్నదాన సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రముఖులు శరణప్ప, వీరేష, వీరభద్ర గౌడ, నాగరాజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున, కౌన్సిలర్ సుఖవాయి మల్లికార్జున, పట్టణ ప్రముఖులు, ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప, పత్తికొండ రంగస్వామి, శ్రీనివాస భక్తులు పాల్గొన్నారు.

జేడీఎస్ కార్యాలయం ప్రారంభం

సిరుగుప్ప, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి జేడీఎస్‌తోనే సాధ్యమని, తాలుకా జేడీఎస్ పార్టీ అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం 17వ వార్డులో జేడీఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ ఆదేశాల మేరకు జేడీఎస్ తాలుకా అధ్యక్షులు శివనారాయణ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.చిక్కబళ్లారి దేవన్న, ముదుకప్ప, హనుమంతప్ప, వీరేష, రామన్న, కురుబర మల్లయ్య, వీరేష జేడీఎస్ తీర్థం పుచ్చుకున్నారు.



జేడీఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మంగళముఖి రాజమ్మకు ఘన సన్మానం



రాజమ్మను సత్కరిస్తున్న డాక్టర్ దానప్ప

కంప్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సుగ్గినహళ్లికి గ్రామానికి చెందిన మంగళముఖి రాజమ్మకు ఆదివారం కంప్లి పట్టణంలో కేంద్ర, రాష్ట్ర దిశా సమితి సభ్యులు డాక్టర్ ఏసీ దానప్ప నివాసంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా దిశా సమితి సభ్యుడు డాక్టర్ ఏసీ దానప్ప మాట్లాడుతూ ఇప్పుడున్న తరంలో తమ సంపాదనలో పేద విద్యార్థులకు గుర్తించి ఆదుకునే వారు నూటికి ఒక్కరు మాత్రమే అందులో రాజమ్మ ఒకరన్నారు. ఈమె సేవలు మరువలేమన్నారు. ఈమె చేసిన సేవల్ని గుర్తించి ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రులు సిద్దరామయ్య ఈ మేరకు అభినందన లేఖ రాయడం సంతోషించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క మంగళముఖి రాజమ్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భిక్షాటన చేసి సంపాదించిన డబ్బులతో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల పిల్లలకు టీ షర్టులు, ప్యాంట్లు స్టేషనరీని పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమని రాజమ్మది చాలా పెద్ద గుణమన్నారు. రాబోయే కాలంలో ఈమె చేసిన సేవలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి ఈమెకు ప్రభుత్వం ద్వారా సదుపాయాలు అందేలా చేస్తామని తెలిపారు. వీరితో పాటు మనోజ్‌కుమార్ దానప్ప పాల్గొన్నారు.

హోసూరు జోన్

డీఎంకేలోకి 200మందికిపైగా చేరిక



ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

హోసూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెలకొండ స్కూల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో డీఎంకేలోకి పలువురు చేరారు. హోసూరు తూర్పు యూనియన్ ఇన్‌చార్జ్ రామూర్తి నిర్వహించిన కార్యక్రమంలో కొత్తకొండపల్లికి చెందిన 200మందికిపైగా కార్యకర్తలు అరుణ్ నాయకత్వంలో చేరారు. పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ నేతృత్వంలో చేరినవారికి పార్టీ కండువాతో స్వాగతించారు.

ముఖ్యమంత్రి స్వాగతానికి సన్నాహక సభ



సన్నాహక సభలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

హోసూరు (కృష్ణగిరి), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆహ్వానించేందుకు డీఎంకే జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణన్ అధ్యక్షతన ఆదివారం ప్రత్యేకంగా సన్నాహక సభ నిర్వమించారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా డీఎంకే కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 11, 12 తేదీలలో నలుపు, ఎరుపురంగు దుస్తుల యూనిఫాంతో సుమారు 2వేల మంది పాల్గొనేలా చేయాలని నిర్ణయించారు. యూరప్ దేశాలను పర్యటించి 16వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించడం ద్వారా వేలాదిమంది కార్మికులకు వీలు కల్పించారని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యాలయాల వద్ద జెండా స్తంభాలను పునరుద్ధరించాలన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణన్, నాయకులు కృష్ణమూర్తి, టాస్మాక్ ట్రేడ్‌యూనియన్ అధ్యక్షుడు రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించే వరకు విస్మరించేది లేదు

●ఎయిమ్స్ సాధన కమిటీ కన్వీనర్ బసవరాజ కళస ● వెయ్యి రోజులు దాటిన నిరసన



నిరవధిక దీక్ష చేస్తున్న పోరాట సమితి నాయకులు

రాయచూరు సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కల్యాణ-కర్ణాటక ప్రాంతంలో రాయచూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ మంజూరు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎయిమ్స్ సాధన కమిటీ కన్వీనర్ బసవరాజ కళస అన్నారు. జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష ఆదివారం నాటికి 1214వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యవంతులు, వివిధ సంఘ సంస్థల ప్రతినిధులు శిభిరంలో పాల్గొని పోరాట సమితి నాయకులకు సంఘిభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బసవరాజ కళస, అత్యంత వెనకబాటుతనంతో కూడిన ఈ ప్రాంతంలో వివిధ నైసర్గిక వాతావరణ పరిపస్థితిల వల్ల దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్న వారు సహితం ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారన్నారు. దీనికి తోడు పలు దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం బెంగళూరు, హైదరాబాద్, పుణ వంటి దూర ప్రాంతాలకు వెళుతున్న నేపథ్యంలో రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు అత్యవసరమన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ విభేదాలను విడనాడి రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ బాధ్యత ఎన్నికైన ప్రజాప్రతినిధుల పై మరింతగా ఉంటుందని ఆ దిశగా అన్ని పార్టీల నాయకులు తమవంతు నిబద్ధతతో కృషి చేయాలన్నారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన కర్ణాటక హైకోర్టు జడ్జి



భూమిపూజలో పాల్గొన్న జడ్జి జస్టిస్ దేవదాస్

రాప్తాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని హంపాపురం గ్రామ సమీపానగల మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ దేవదాస్ ఆదివారం సందర్శించారు. మౌనగిరి క్షేత్రంలో దక్షిణామూర్తి దేవాలయ భూమిపూజ కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. 39 అడుగుల ఏక శిలా హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య. కర్ణాటక హైకోర్టు జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అదనపు జడ్జి సత్యవాణి పాల్గొన్నారు.

సామాజిక సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

రాయచూరు సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్ సూచనల మేరకు నిర్వహిస్తున్న సామాజిక,విద్య సమీక్ష జిల్లాలో పకడ్బందీగా సాగాలని జిల్లాధికారి కే నితీశ్ సూచించారు. సామాజిక, విద్య సమీక్షకు సంబంధించి ఆదివారం జిల్లాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తొలి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి, ప్రభుత్వం కమిషన్ ఇచ్చిన సూచనలను మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మాస్టర్ ట్రైనర్‌లకు గణాంకాలు సేకరించే అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక అంచనా మేరకు జిల్లాలో 4లక్షల 75 వేల కుటుంబాలను వెనకబడిన వాటిగా గుర్తించగా ఏ ఒక్క కుటుంబాన్ని కూడా సమీక్షలో విస్మరించరాదని జిల్లాధికారి సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నితీశ్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

శివానంద సరస్వతి (జయంతి)



ప్రముఖ యోగా, హిందూ ఆధ్యాత్మిక గురువు శివానంద సరస్వతి 1887 సెప్టెంబరు 8న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి జిల్లా పట్టమడైలో జన్మించారు. పూర్వాశ్రమంలో ఆయన పేరు కుప్పుస్వామి. వైద్యవిద్యను అభ్యసించారు. చాలాకాలం వైద్యుడిగా పనిచేశారు. 1936లో డివైన్ లైఫ్ సొసైటీలో యోగా వేదాంత ఫారెస్ట్ అకాడమీ స్థాపించారు. యోగా, వేదాంత అంశాలపై 200కుపైగా పుస్తకాలు రచించారు. రిషికేశ్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో శివానందనగర్ వద్ద గంగానది ఒడ్డున అకాడమీ ప్రధాన ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన శిష్యుడు విష్ణుదేవానంద ద్వారా యోగాకు మరింత ప్రాచుర్యం లభించింది. శివానంద సరస్వతి 1963 జూలై 14న నిర్యాణం చెందారు.

త్రిపురనేని గోపీచంద్ (జయంతి)



తెలుగు రచయిత, సంపూర్ణ మానవతావాది త్రిపురనేని గోపీచంద్ 1910 సెప్టెంబరు 8న కృష్ణా జిల్లా అంగలూరులో జన్మించారు. సాహితీవేత్తగా, తెలుగు సినిమా దర్శకుడిగా రాణించారు. ఆంధ్రప్రదేశ్ సమాచారశాఖ సహాయ డైరెక్టర్‌గా పనిచేశారు. 1957-62 వరకు ఆకాశవాణిలో పనిచేశారు. ఉభయకుశలోపరి కార్యక్రమం జనరంజకమైనది. కాళిదాసు రచనలను రేడియో రూపకాలుగా రాశారు. అరవిందుడి భావాలతో ఆకర్షితులై ఆధ్యాత్మికతవైపు సాగారు. 1962 నవంబరు 2న కన్నుమూశారు. మరణానంతరం 1963లో ఆయన రచనలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది.

చక్రవర్తి (జయంతి




స్వరసామ్రాట్‌గా పేరొందిన చక్రవర్తి అసలుపేరు కొమ్మినేని అప్పారావు. 1936 సెప్టెంబరు 8న గుంటూరు జిల్లాలో జన్మించారు. సంగీతంలో ఘనాపాఠి. నాటి స్టార్ హీరోల ఇమేజ్‌కు ఆయన బాణీలు ఇతోధికంగా తోడ్పడ్డాయి. శాస్త్రీయ సంగీతంలో కాకలు తీరకపోయినా రాగాలతో చక్రవర్తి చేసిన ప్రయోగాలు అనన్యం. దర్శకుడి ఆలోచనా సరళికి అనుగుణంగా ఆయన పాట రూపుదిద్దుకుంటుంది. నటులకు డబ్బింగ్ చెప్పడమే కాక నటనా పటిమతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు 884 సినిమాలకు సంగీత దర్శకత్వం అందించారు. ఇంకా కన్నడ, తమిళ, మలయాళ సినిమాలకు స్వరాలు సమకూర్చారు. గాయకుడిగా 400 పాటలు పాడడమే కాక లిరిక్ రైటర్‌గా 16 పాటలు రాశారు. 2002 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

ఆశా భోస్లే (పుట్టినరోజు)



ప్రముఖ బాలీవుడ్ గాయనీమణి ఆశాభోస్లే 1933 సెప్టెంబరు 8న జన్మించారు. ఆరు దశాబ్దాలపాటు వెయ్యికిపైగా సినిమాలలో పాటలు పాడారు. అంతేకాక పాప్ మ్యూజిక్, గజల్స్, భజన పాటలతోపాటు భారత సంప్రదాయ జాన పదం, ఖవ్వాలి పాటలను సైతం పాడారు. ఏడుసార్లు ఉత్తమ నేపథ్య గాయనిగా అవార్డులు అందుకు న్నారు. రెండు జాతీయ పురస్కారాలు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు.

మాధవపెద్ది సురేష్ (పుట్టినరోజు)



ప్రముఖ తెలుగు సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ 1951 సెప్టెంబరు 8న తెనాలిలో జన్మించారు. సినిమాలో తొలిసారిగా అకార్డియన్ అనే పరికరాన్ని వాయించారు. తర్వాత కీబోర్డ్ ప్లేయర్‌గా పలువురు సంగీత దర్శకుల వద్ద సుమారు వెయ్యి సినిమాలకు పనిచేశారు. జంధ్యాల సినిమా 'హై హై నాయకా'తో సంగీత దర్శకుడిగా మారారు. బృందావనం సినిమా ఆయనకు మంచి పేరు తెచ్చింది. భైరవద్వీపం చిత్రానికి గుర్తింపు దక్కింది. రెండు నంది అవార్డులు, సాలూరి ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

విద్యుత్ సమస్యలపై వినతులు

దర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలపై టీడీపీ నాయకులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మవరానికి ఆదివారం వచ్చిన మంత్రిని టీడీపీ పట్టణ అధ్య క్షుడు పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, చీమల రామాంజి, క్లస్టర్ రామాంజి, అమర్, షరీఫ్ కలిసి విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అంద జేశారు. పట్టణంలోని ప్రియాంకనగర్‌లోని 52, 53, 54, 55, 59 నంబర్ల విద్యుత్ స్తంభాలకు వర్షాలు వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా అవుతోం దన్నారు. అదేవిదంగా లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, కావున 100 కేవీ డీపీ మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. హమాలీ కాలనీలోనూ చిరంజీవి అనే స్థానికుడి ఇంటిపై విద్యుత్ లైన్ వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని వారు మంత్రిని కోరారు. అదేవిధంగా శివరాంనగర్‌లో కేవీ 33 లైన్ తారక రామాపురం సబ్ స్టేషన్ నుంచి ఇళ్లపై వెళ్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని టీడీపీ నాయకుడు రాంపురంశీన మంత్రికి విన్నవించారు.

కల్యాణనగర్‌లో ఘనంగా గ్రామ పండుగ



భారీ జన సందోహం నడుమ ఊరేగింపు



వాహనాలకు పుష్పాలంకరణ

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కల్యాణనగర్ ప్రాంతంలో ఆదివారం గ్రామపండుగ అంగరంగ వైభవంగా సాగింది. శనివారం ఉదయంనుంచే ప్రత్యేక పూజలు కొనసాగాయి. రాత్రి ప్రారంభమైన గ్రామ దేవతల ఊరేగింపు ఆదివారం మధ్యాహ్నం దాకా కొనసాగింది. కల్యాణనగర్ ప్రాంతమంతా సందడి అనిపించింది. గ్రామదేవతలతోపాటు ఈ ప్రాంతంలోని అన్ని ఆలయాలకు సంబంధించిన దేవతల ఊరేగింపు కనువిందుగా సాగింది.

నేత్రదానంపై అవగాహనకు సైకిల్ థాన్

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా నారాయణ నేత్రాలయ ఆధ్వర్యంలో సైకిల్‌థాన్ నిర్వహించారు. నారాయణ నేత్రాలయ డైరెక్టర్ నరేన్‌శెట్టి సీతారామపాళ్య మెట్రోస్టేషన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేన్‌శెట్టి మాట్లాడుతూ 1.3 మిలియన్లమంది అంధత్వంతో బాధపడుతున్నారని వారికి నేత్రదానం అనుకూలం కానుందన్నారు. పది మిలియన్లమంది కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలలో అవగాహన పెరిగితే నేత్రదానం ద్వారా ఎంతో మందికి మేలు చేకూరనుందన్నారు. మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ హర్ష, నారాయణ నేత్రాలయ సీఈఓ కేప్టెన్ ఎస్‌కే మిట్టల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. సుమారు 150మంది సైక్లిస్టులు భాగస్వామ్యులయ్యారు.



సైకిల్ థాన్‌కు పచ్చజెండా ఊపుతున్న దృశ్యం

సేవే లక్ష్యంగా వాసవీక్లబ్‌ల స్థాపన



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమాజసేవ లక్ష్యంగా వాసవి క్లబ్‌లు కొనసాగుతున్నాయని వక్తలు పేర్కొన్నారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అరికెరెలోని వాసవి దేవస్థానంలో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి సంస్థ రీజియన్ చైర్మన్ రాజశేఖర్‌శెట్టి అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వాసులకు 75 గోవులను ఇచ్చామని తద్వారా పాలతో వారికి ఉపాధి సాధ్యం చేశామన్నారు. నాలుగు గోశాలలకు గరుకురాయి ఇచ్చామన్నారు. విద్యార్థులకు యోగా డ్రెస్, ఇతరత్రా సదుపాయాలు కల్పించామన్నారు. ఇదే సందర్భంగా పత్రికారంగ సేవలను కొనియాడుతూ జర్నలిస్టులకు, వివిధ సమాజసేవకులను ఆత్మీయంగా సత్కరించారు. సమావేశంలో రాధామాధవి, వాసవి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కే పోతణ్ణశెట్టి, ప్రభావతి, పద్మలత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో పురస్కారాలు అందచేశారు. సమావేశంలో భాగంగా తొలుత థైరాయిడ్‌కు ఉచిత పరీక్షా శిబిరం నిర్వహించారు. సుమారు 50మంది దాకా పరీక్షలు చేయించుకున్నారు.

ఎన్‌గ్రేవ్ మైండ్స్ ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానం

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్‌గ్రేవ్‌మైండ్స్ సంస్థ ఎడ్యుకేషన్ సమ్మిట్ అవార్డులను ప్రదానం చేసింది. చంద్ర లే అవుట్ విజయనగరలోని సెయింట్ ఫ్లవర్స్ ఇంగ్లిష్‌స్కూల్‌కు దక్కిను అవార్డును పాలకమండలి చైర్మన్ డాక్టర్ జీఆర్ కృష్ణప్ప పొందగా, అంజలి కాన్వెంట్ నైటింగేల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణగౌడలకు ఎన్‌గ్రేవ్‌మైండ్స్ సంస్థ ఎండీ డాక్టర్ బీఏ కళాశంకర్ ప్రదానం చేశారు. పలువురు విద్యానిపుణులు భాగస్వామ్యులయ్యారు. భారతీయ సంప్రదాయ ట్రస్టు డాక్టర్ మహర్షి గురూజీ ముఖ్యులుగా పాల్గొన్నారు.



పురస్కారం అందజేస్తున్న కళాశంకర్ తదితరులు

బెంగళూరు దేశ ఆరోగ్యసేవల రాజధాని

» డాక్టర్ శరణ్ శివరాజ్‌పాటిల్

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం దేశ ఐటీ రాజధానిగా ఉందని మరికొన్నేళ్లలో దేశ ఆరోగ్యసేవల రాజధాని కానుందని స్పర్శ్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ శరణ్ శివరాజ్‌పాటిల్ అభిప్రాయపడ్డారు. సర్జాపురలో 250 పడకల సామర్థ్యంతో స్పర్శ్ ఆసుపత్రి 9వ శాఖను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు నగరానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. కర్ణాటకలో పేరొందిన స్పర్శ్ ఆసుపత్రి క్రమేపీ విస్తరించుకోవడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్రాలు, ప్రాంతాలలో విస్తరించుకుంటుందన్నారు. ఆసుపత్రి ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతలో భాగంగా వందమందికిపైగా ఉచితంగా శారీరక వైకల్యాలను సరిచేసే శస్త్ర చికిత్సలను నిర్వహించడం అభినంద నీయమన్నారు. సుప్రీకోర్టు మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్, సుత్తూరు మఠాధిపతి దేశికేంద్రస్వామిజీ, ఆసుపత్రి సీఈఓ జస్దీప్‌సింగ్, మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్, సిక్కిం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బసవప్రభు ఎస్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుత్తూరు మఠాధిపతి దేశికేంద్ర స్వామీజీ

కోరమంగలలో గణేశ్ ఉత్సవం



మేలూరులో...

బెంగళూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరమంగల ఎస్‌టీ బెడ్ లే అవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశ ఉత్సవం జరిగింది. లే అవుట్‌లో తొలిసారి ఉత్సవం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఎస్ చంద్రప్పతోపాటు నిర్వాహకులు మంజునాథ్ పలువురిని ప్రత్యేకంగా సత్కరించారు. ఉత్సాహంగా వేడుకలు జరిగాయి.

మేలూరులో ఘనంగా గణేశ నిమజ్జనం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామంలో ఓంకార్ గణేశ మిత్రబృందం ఆధ్వర్యంలో 27వ వార్షిక గణేశ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 7.30గంటలకు ప్రారంభమైన ఊరేగింపు పురవీధులలో సాగింది. వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. విద్యుద్దీపాల అలంకరణ, బాణా సంచా నడుమ ఊరేగింపు సాగింది. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. సంఘానికి చెందిన శ్రీనివాస (దాసప్ప), మదన్ మహేశ్, గజేంద్ర, పునీత్ తదితరులు పాల్గొన్నారు.



కోరమంగల ఉత్సవంలో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

గ్రహణ వీక్షణకు ఏర్పాట్లు





చంద్ర గ్రహణం వీక్షించేందుకు నగర ప్రజలు ఆసక్తిచూపారు. నగరంలోని జవహర్‌లాల్‌నెహ్రూ ప్లానెటోరియంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఇందుకోసం భారీ బైనాక్యులర్స్ సమకూర్చారు. ఆదివారం రాత్రి వందలాదిమంది ప్లానెటోరియం చేరుకుని ఆసక్తిగా వీక్షించారు. **(ఆంధ్రజ్యోతి, బెంగళూరు)**

హంద్రీనీవా నీరు వచ్చేనా..?

గాండ్లపెంట, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలానికి హంద్రీనీవా కాలువ నీరు వచ్చేనా? అనే ప్రశ్న రైతుల్లో నెలకొంది. హంద్రీనీవా కాలువ నీరు జిల్లాలు దాటి కుప్పానికి వెళ్తోంది. అయితే గాండ్లపెంట మండలానికి రాకపోవడంతో మండల రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఉమ్మడి జి ల్లాలోని అత్యంత మెట్ట ప్రాంతం ఉన్న, అత్యల్ప వర్షపాతం నమోదు అ య్యే గాండ్లపెంట మండలానికి కాలువల ద్వారా నీరు వస్తే రైతులు పంట లు సాగుచేసుకుని జీవనం సాగించవచ్చు. హంద్రీనీవా నీరు మండలానికి రప్పిస్తామంటూ ఎన్నికల ముందు నాయకులు హామీలు గుప్పించారేకానీ, కార్యరూపం దాల్చలేదు. మండల వ్యాప్తంగా వందకు పైగా చెరువు లు ఉ న్నాయి. భారీ వర్షాలు కురిస్తేనే అవి నిండుతాయి. అరకొర వర్షాలకు చుక్కనీర ఉండదు. మండలంలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆ ధారపడి జీవనం సాగిస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటి పోవడంతో పం టలు సాగుచేయలేకపోతున్నారు. ప్రధానంగా ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ సాగుచేస్తారు. అతివృష్టి, అనా వృష్టి కారణంగా పెట్టు బడులు దక్కని పరిస్థితిలో దాదాపు రైతులందరూ ఖరీఫ్‌లో వేరుశనగను వదలేసి, బోర్లకింద మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. అయితే బోర్లు ఎండిపోయి ఎంతోమంది నష్టాలు చవి చూశారు. అలాంటి మండలంపై ఏ నాయకుడూ కరుణ చూపడం లేదని మండల రైతులు విమర్శిస్తున్నారు.



ఎండిపోయిన పోరెడ్డివారిపల్లి చెరువు

చిన్నారులతో కలిసి నరేన్ కార్తికేయన్ సందడి



చిన్నారులతో కార్తికేయన్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మోటార్‌స్పోర్ట్స్ రేస్‌లో పేరొందిన నరేన్ కార్తికేయన్ చిన్నారులతో కలసి సందడి చేశారు. ఓరియన్‌మాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లోగోఆర్‌ను ఆవిష్కరించారు. చిన్నారులు, యువతతో రేసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈనెల 14నుంచి పోటీలు జరగనున్నాయి.

రుగ్మతల నివారణకు వెల్‌నెస్ క్లినిక్



సంస్థ ప్రారంభోత్సవంలో రిషబ్‌జైన్ తదితరులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనేక రుగ్మతల నివారణకు వెల్‌నెస్ క్లినిక్‌లు దోహదపడతాయని సహసంస్థాపకులు రిషబ్‌జైన్ అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సౌకర్యాలతో వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. జయనగర్, జేపీ నగర్‌లలో శాఖల ప్రారంభం సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ఆవిరి పట్టడం, కీళ్లనొప్పులకు మసాజ్‌లు, ఐవీ డ్రీమ్ థెరపీ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం బిజీగా ఉంటూ వ్యాయామానికి తగిన సమయం కేటాయించలేనివారికి ఇటువంటివి ఉపకరిస్తాయన్నారు. రానున్న రోజులలో తమశాఖలు విస్తరింపచేస్తా మన్నారు. సహసంస్థాపకులు రోషన్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

జోస్యం ముసుగులో ఉంగరం చోరీ

» మధ్యప్రదేశ్ వాసులు ఐదుగురి అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాధువుల వేషంలో కారులో వచ్చి ఓ రైతుకు జోస్యం చెప్పేలా ప్రయత్నించి బంగారు ఉంగరాన్ని చోరీ చేసిన సంఘటన చిత్రదుర్గ జిల్లాలో చోటు చేసుకుంది. సాధువుల వేషంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఐదుగురిని తురవనూరు పోలీసులు అరెస్టు చేశారు. వారిలో కమల్‌నాథ్ (58), భైన్‌నాథ్‌చౌహాన్ (62), సంతోష్‌నాథ్ (42), శ్రవణ్‌జోగి (27), కారు డ్రైవర్ టోనియో (22)లు అరెస్టు అయినవారు. వీరు మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లా గోగావన్ తాలూకాకు చెందినవారుగా గుర్తించారు. చిత్రదుర్గ తాలూకా చిక్కగొండనహళ్ళి రవికుమార్ అనే రైతు 50వ నెంబరు జాతీయరహదారిపై మరొకరికోసం వేచియున్నారు. ఇదే సమయంలోనే సాధువుల వేషంలో వచ్చినవీరు రైతు రవికుమార్‌ను నమ్మించి భవిష్యత్తు చెబుతామంటూ నచ్చచెప్పారు. ముఖానికి ఓ బూడిదలాంటి పొడిని చల్లడంతో ఐదు నిమిషాలు స్పృహ కోల్పోయారు. అంతలోనే ఉంగరాన్ని కాజేసి పరారీ అయ్యారు. రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు ఇన్‌స్పెక్టర్ బసవరాజ్‌పాటిల్ సమీప స్టేషన్లలో అప్రమత్తం చేసి వారిని గుర్తించి శనివారం అరెస్టు చేశారు.

కోర్టు నోటీసు ఇచ్చిన అమీన్‌పై కారప్పొడితో దాడి



అమీన్ శంకరగౌడ

బెంగళూరు, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): కోర్టు నోటీసు ఇచ్చేందుకు వెళ్లిన అమీన్ కళ్లలో కారంకొట్టిన సంఘటన మండ్యజిల్లా కేఆర్ పేట తాలూకా మలెనహళ్ళిలో చోటు చేసుకుంది. కేఆర్‌పేట సిటీ సివిల్‌కోర్టు అమీన్ శంకరగౌడ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. చిక్కమగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అమీన్ శంకరగౌడ వాహన యజమానితో కలసి సాకమ్మ అనే మహిళ ఇంటికి వెళ్లారు. ఆవేశంతో సాకమ్మ అమీన్ కళ్లలోకి కారప్పొడి చల్లారు. ఈ వివాదానికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాలేదు. మహిళ.. అమీన్ కళ్లలోకి కారంకొట్టిన వీడియోలు వైరల్ అయ్యాయి.

పండ్లతోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తనకల్లు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్లతోట పెంపకం పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఏపీఓ మరియమ్మ ఆదివారం తెలిపారు పండ్లతోటల పెంపకానికి ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం అన్ని అవ కాశాలను కల్పించిందన్నారు. పండ్ల మొక్కలు నాటే రైతులకు మూడేళ్లపాటు ఉపాధి హామీ పథకం నిధులు కేటాయి స్తున్నట్లు వివరించారు. అన్ని రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిం దన్నారు. పాడిపైన ఆధారపడిన రైతులు తప్ప కుండా గడ్డిపెంకపం చేపట్టాలని సూచించారు. గడ్డి పెంపకానికి కూడా ఉపాధి హామీ పథకంలో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పండ్లతోటలు, పూల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సహకాలు అందిస్తోందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా మండలకేంద్రంలోని ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించాలని తెలిపారు.